తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
సోమవారం
03 ఆగష్టు 2026
పేజీలు : 8

# స్నేహం.. జీవితాన్ని మార్చే మహా శక్తి

## ఫ్రెండ్‌షిప్ డే ప్రత్యేక కథనం

ప్రతి మనిషి జీవితంలో స్నేహం అత్యంత విలువైన బంధం. రక్తసంబంధం లేకపోయినా, కష్టసుఖాల్లో అండగా నిలిచే అనుబంధమే నిజమైన స్నేహం. ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి ఆదివారం జరుపుకునే ఫ్రెండ్‌షిప్ డే స్నేహితుల విలువను గుర్తు చేసుకునే ప్రత్యేక సందర్భం. నిజమైన స్నేహితుడు మన విజయాన్ని చూసి సంతోషపడటమే కాకుండా, ఓటమిలో ధైర్యం చెప్పి ముందుకు నడిపిస్తాడు. స్వార్థం, కులం, మతం, ధనిక?పేద అనే భేదాలకు అతీతంగా నమ్మకం, ప్రేమ, గౌరవంపై నిలిచే బంధమే స్నేహం. శ్రీకృష్ణుడు?కుచేలుడు, కర్ణుడు?దుర్యోధనుడు వంటి స్నేహాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. పాఠశాల రోజుల స్నేహాలు జీవితాంతం మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. సోషల్ మీడియా యుగంలో వేలాది పరిచయాలు ఉన్నా, కష్టసమయంలో తోడుగా నిలిచేవారే నిజమైన స్నేహితులు. యువత సేవా కార్యక్రమాలు, రక్తదానం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల ద్వారా స్నేహానికి కొత్త అర్థాన్ని ఇస్తున్నారు. మహిళలు, వృద్ధుల జీవితాల్లో కూడా స్నేహం మానసిక బలాన్ని అందిస్తోంది. చిన్న మనస్పర్థలతో దూరమైన స్నేహితులను ఈ ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా మళ్లీ పలకరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచం ఎంత మారినా నిజమైన స్నేహానికి ప్రత్యామ్నాయం లేదని ఈ రోజు మరోసారి గుర్తు చేస్తోంది. "స్నేహితుడు జీవితాంతం కోసం" అనే సందేశంతో ఫ్రెండ్‌షిప్ డేను అర్థవంతంగా జరుపుకోవాలని పిలుపునిస్తున్నారు.




### తల్లి ప్రమాదంతో మనస్తాపం..

# 16 ఏళ్ల బాలుడు మృతి

### కామారెడ్డి ఉస్మాన్‌పూర్‌లో విషాదం ?

### కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2 (జనం సాక్షి):** కామారెడ్డి పట్టణంలోని ఉస్మాన్‌పూర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబంలో జరిగిన అనుకోని పరిణామాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన 16 ఏళ్ల బాలుడు మృతి చెందాడు.మృతుడి తండ్రి మహమ్మద్ ఇర్ఫాన్ సిద్ధిఖీ పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం, రెండు రోజుల క్రితం తన భార్య కాలు విరగడంతో ఆగస్టు 1న ఆమెను కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. ఆ సమయంలో ఇంట్లో చిన్న కుమారుడు మహమ్మద్ అబ్దుల్ సమద్ సిద్ధిఖీ (16), విద్యార్థి, ఒంటరిగా ఉన్నాడు.అదే రోజు రాత్రి సుమారు 8:40 గంటలకు పెద్ద కుమారుడు అబ్దుల్ సలాం సిద్ధిఖీ ఇంటికి వెళ్లగా తలుపులు మూసి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా, తమ్ముడు స్పందించని స్థితిలో కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



## తబితా ఆశ్రమంలో ఘనంగా 'ఫ్రెండ్‌షిప్-డే' వేడుకలు..

అంతర్గాం, జనంసాక్షి : రామగుండంలోని తబితా పిల్లల ఆశ్రమంలో 'ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ' ఆధ్వర్యంలో మిత్రుల దినోత్సవ వేడుకలు అత్యంత ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.తబితా ఆశ్రమంలో ఉన్న చిన్నారులతో కలిసి ఘనంగా ఫ్రెండ్షిప్-డే వేడుకలు జరిపారు.కార్యక్రమానికి ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆశ్రమ పిల్లల మధ్య కేక్ కట్ చేసి వారితో కలిసి పంచుకున్నారు.పిల్లలందరికీ కేక్ తినిపించి ఆప్యాయంగా శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మద్దెల దినేష్ మాట్లాడుతూ పిల్లలందరూ కష్టపడి బాగా చదువుకొని జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.అమ్మానాన్న లేనిలోటు తెలియకుండా ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్రనాయక్ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ సొంత పిల్లల్లా సాకుతున్న తీరు ఎంతో అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పలు ప్రముఖ సంఘాల నాయకులు భాగస్వాములయ్యారు.సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేష్ కుమార్,ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఎంఎ గౌస్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.లెనిన్ తదితరులు పాల్గొని పిల్లలతో మమేకమై ఫ్రెండ్‌షిప్-డే శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆశ్రమ పిల్లలు తమ ప్రతిభను చాటుతూ పాటలు పాడుతూ,ఆటపాటలతో సందడి చేస్తూ ఈ వేడుకను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.

## సనాతన ధర్మ పరిరక్షణకు సమాజం ఏకమవ్వాలి..

### - బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి..



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం కార్పొరేషన్ పరిధి లక్ష్మీనగర్‌లో వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామాలయ ఆధ్యాత్మిక కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ వికాస తరంగిణి సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.శ్రీరాముడు లోకానికి, సమాజానికి ఆదర్శమూర్తి అని, ఆయన చూపిన ధర్మమార్గంలో నడవడం ప్రతి హిందువు బాధ్యత అని అన్నారు.సమాజంలో ఐక్యత పెంపొందించేందుకు, సనాతన ధర్మ పరిరక్షణకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు.అలాగే జీవన్ స్వామి వారి ఆశీర్వాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడం ఆనందదాయకమని, రైతులకు అనుకూలంగా మంచి వర్షాలు కురవడం కూడా దైవానుగ్రహమేనని ఆమె పేర్కొన్నారు.హిందూ సమాజం ఐక్యంగా ఉండి ధార్మిక, సాంస్కృతిక విలువలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వికాస తరంగిణి ప్రతినిధులు మాట్లాడుతూ, హిందూ సమాజాన్ని ఏకం చేయడం, సనాతన ధర్మ పరిరక్షణ, యువతలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాంటి ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాంతా-అశోక్‌రావు, అంజలి, సుజాత, మల్లీశ్వరి, రజిత, ప్రమీల,రాజేందర్, శోభ,రాజ్యలక్ష్మి,వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

## సమరకేతన్‌కు నివాళులు అర్పించిన ఏఐటీయూసీ..

**గోదావరిఖని, జనంసాక్షి :** సీపీఎం నాయకులు యాకయ్య కుమారుడు సమరకేతన్ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం హైదరాబాద్‌లో ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.గోదావరిఖని జీఎం కాలనీలోని యాకయ్య ఇంటి వద్ద సమరకేతన్ పార్థివ దేహంపై గుర్తింపు సంఘం (ఏఐటియుసి) నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.సమరకేతన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.నివాళులు అర్పించిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, కోశాధికారి ఎస్.వెంకట్‌రెడ్డి,ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్‌కుమార్ ఉన్నారు.





## ఆమ్దాపూర్ గ్రామంలో ఘనంగా బోనాలు

**బోధన్, ఆగస్టు 2 ( జనంసాక్షి ) :**
బోధన్ మండలం ఆమ్దాపూర్ గ్రామంలో ఆదివారం ఘనంగా బోనాలు నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో మహిళలు పెద్ద ఎత్తున తమ ఇంటి నుండి బోనాలను తీసుకెళ్లి గ్రామంలోని మహాలక్ష్మి మందిరం వరకు ఎంతో భక్తిశ్రద్ధలతో వెళ్లడం జరిగింది. డప్పు వాయిద్యాలతో గ్రామంలోని ప్రతి ఇంటి నుండి తీసిన బోనాలతో మహాలక్ష్మి మందిర్ వరకు చేరుకొని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి మందిరం వద్ద పూజారులు గ్రామస్తులను ఉద్దేశించి ప్రవచనం చెప్పి అమ్మవారి గొప్పతనాన్ని బోనాల చరిత్రను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోరెడ్డి గంగాధర్, ఉప సర్పంచ్ రుమాజీ, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు జయ నాగన్న, సభ్యులు బొర్ర పల్లెన్న , నాగేష్, రత్నాకర్, నాగర్ గంగాధర్, నర్రా సుధాకర్, కురుమ రాజు, మాజీ సర్పంచ్ సుదర్శన్, గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## ఆచన్ పల్లిలో కేకు కట్ చేసిన కాంగ్రెస్ నాయకులు

**బోధన్, ఆగస్టు 2 ( జనంసాక్షి ) :**



బోధన్ పట్టణ శివారు ఆచన్ పల్లిలో బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని ఒకటో వార్డు కౌన్సిలర్ వేములపల్లి లక్ష్మి రామ్మూర్తి, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీ కేకును కట్ చేసి జన్మదిన సంబరాలను జరుపుకున్నారు. టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గణపతి రెడ్డి, తాళ్ల రమేష్ గౌడ్ ల ఆధ్వర్యంలో కేకును కట్ చేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రావి విజయ్ , సలీం, మాజీ సర్పంచ్ సాయిలు, కొడాలి రవి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్దుర్కిలో ఘనంగా బోనాల వేడుకలు

## ఆకర్షణగా నిలిచిన శివసత్తులు

**బోధన్, ఆగస్టు 2 ( జనంసాక్షి ) :**
బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో బోనాల వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. శివసత్తులు భక్తి పారవశ్యంతో ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాలు, ఊరేగింపులతో గ్రామమంతా ఆధ్యాత్మిక, ఉత్సవ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ జ్యోతి శంకర్, విడిసి చైర్మన్ గంగాధర్, వైస్ చైర్మన్ తుడుం బాబు, క్యాషియర్ సాయి, గ్రామ పెద్దలు శ్రీనివాస్,మరయ్య, రాజన్న, రామ్, మల్లు గౌండ, హన్మాండ్లు, సిరిగిరి అశోక్, చంద్రకాంత్, బాలు, రాజు, విడిసి డైరెక్టర్లు, కులాల పెద్ద మనుషులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అభిమానానికి రక్తంతో గుర్తింపు

**ఎల్లారెడ్డి (జనం సాక్షి ) ఆగస్టు 02:**
ఎల్లారెడ్డి శాసన సభ్యులు మదన్ మోహన్ జన్మదినం సందర్భంగాగండిమాసానిపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కుచులకంటి శంకర్ తన అభిమానంతో, ఆరాధనతో రక్తంతో చిత్రించిన మదన్ మోహన్ చిత్రపటాన్ని ఫోటో ఆల్బమ్ రూపంలో బహుమతిగా అందజేశారు.ల అభిమాని యొక్క అభిమానానికి సంతోషం వ్యక్తం చేసి ప్రత్యేకంగా అభినందించారు.



## మంథని వాసికి అరుదైన గౌరవం..!

### సమాజ సేవకు గుర్తింపుగా నల్మాసు ప్రభాకర్‌కు 'వైశ్య వైభవ రత్న' బిరుదు, స్వర్ణ కంకణంతో ఘన సత్కారం

**మంథని, ఆగస్టు 02 (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా మంథని పట్టణానికి చెందిన ప్రముఖ సమాజ సేవకుడు, పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు నల్మాసు ప్రభాకర్‌కు అరుదైన గౌరవం దక్కింది. సమాజ సేవలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆదివారం హైదరాబాద్‌లోని హరిహర భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 'వైశ్య వైభవ రత్న' బిరుదుతో పాటు స్వర్ణ కంకణం అందజేసి ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌కు చెందిన లలిత కళా సమాఖ్య (సామాజిక?సాంస్కృతిక సేవా సంస్థ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ప్రముఖుల సమక్షంలో ప్రభాకర్‌ను సన్మానించారు. గత రెండున్నర దశాబ్దాలుగా ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి, సమాజ సేవకు, పలు సేవా కార్యక్రమాలకు ఆయన అందిస్తున్న విశేష కృషిని గుర్తించి ఈ అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.నల్మాసు ప్రభాకర్ సామాజిక, సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో నిరంతరం చురుకుగా పాల్గొంటూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారని పలువురు వక్తలు కొనియాడారు. ఆయనకు ఈ పురస్కారం లభించడం వ్యక్తిగత గౌరవమే కాకుండా మంథని ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంథని ప్రాంతానికి చెందిన పలువురు ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, మిత్రులు నల్మాసు ప్రభాకర్‌ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య యువజన కార్యదర్శిగా రవికంటి సతీష్ నియామకం



**మంథని, ఆగస్టు 02, (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా మంథని పట్టణానికి చెందిన రవికంటి సతీష్‌కు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం లభించింది. హైదరాబాద్‌లోని లక్డికాపూల్ వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్య సంఘ నాయకులు, యువజన ప్రతినిధులు, ప్రముఖుల సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సమాజాభివృద్ధి, యువత సంక్షేమం, సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రావికంటి సతీష్ కుమార్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులవడం పట్ల మంథని ప్రాంత ఆర్యవైశ్య సంఘ నాయకులు, వ్యాపారవేత్తలు, యువజన ప్రతినిధులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సమాజ అభివృద్ధికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.





## అల్లీపూర్ లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**జనం సాక్షి రాయికల్:**
ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలోని అంగన్వాడి రెండో సెంటర్లో ఆదివారం బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మేఘమాల గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టించడం ఎంతో అవసరమన్నారు. పుట్టిన తొలి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆమె సూచించారు. తల్లి పాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు.తల్లిపాలు శిశువుకు తొలి ఆహారం, తొలి టీకా, ప్రకృతి ప్రసాదించిన అమృతమని పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. తల్లులు తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించుకోవాలని, శిశువుల ఆరోగ్యవంతమైన భవిష్యత్ కోసం ప్రతి తల్లి తల్లిపాలను తప్పనిసరిగా అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ ఎన్.శారద, బి.రజిత, డి.రమాదేవి,డి. గంగుగర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న సుగుణ కి కోరుట్ల కానిస్టేబుల్ సురేష్ రక్తదానం

**కోరుట్ల ఆగస్టు 2(జనంసాక్షి)**



జగిత్యాల పట్టణంలోని 75 సంవత్సరాల టీ.సుగుణ కి కాలు విరిగి ఆపరేషన్ కోసం ఓం సాయి హాస్పిటల్ జగిత్యాల డాక్టర్ పనింద్ర రక్తం అవసరం ఉందని తెలియజేయగానే జగిత్యాల రక్తదానం గ్రూప్ వారు తరఫున తెలుపగ కోరుట్ల లోని పోలీస్ విధులు నిర్వహిస్తున్న సురేష్ కోరుట్ల నుండి వెళ్లి రక్తదానం చేసినారు. సురేష్ 11వసారి రక్తదానం చేసి ఎందరికో ఆపదలో ఉన్న వారికి ఇవ్వడం జరిగింది ఇలా ముందు ముందు కూడా ఇవ్వడానికి నేను ముందు ఉంటానని తెలియజేశారు.ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని కోరుకుంటున్నాము అని సుగుణ కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపినారు.

## మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాకాంబరి అలంకరణ వైభవం.,

**మల్లాపూర్, ఆగస్టు 02 (జనంసాక్షి)**



మల్లాపూర్ మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఆధ్వర్యంలో, మల్లాపూర్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి శాకాంబరి అవతారంలో విశేష అలంకరణ నిర్వహించి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపి, అనంతరం మహిళలకు ఆషాఢ మాస విశిష్టతను పురస్కరించుకొని గోరింటాకు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు సోమ అశ్విన్ కుమార్ గుప్తాకోశాధికారీ నూనె శ్రీనివాస్ సెక్రటరీ చింత శశిధర్ నూనె ఆంజనేయులు ,కంటాల శ్రీనివాస్ మైలారం నరేష్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు మరియు భక్తులు పాల్గొన్నారు.

# స్నేహం... రక్తసంబంధాలకు మించిన ఆత్మీయ బంధం



**ముస్తాబాద్ ఆగస్టు 02( జనం సాక్షి)**తల్లిదండ్రులకు కూడా చెప్పలేని మనసులోని మాటలను పంచుకునే నమ్మకమే నిజమైన స్నేహం.. ఆస్తిపాస్తుల కంటే మంచి మిత్రులే జీవితంలో గొప్ప సంపదఆగస్టు 2, ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి ఆదివారం ప్రపంచవ్యాప్తంగా ఫ్రెండ్షిప్ డేను జరుపుకుంటారు. ఈ ఏడాది (2026) ఆగస్టు 2న ఫ్రెండ్షిప్ డే సందర్భంగా దేశవ్యాప్తంగా స్నేహితులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ అనుబంధాన్ని మరింతబలపరుచుకుంటున్నారు. ఈ ప్రత్యేక దినోత్సవం స్నేహం అనే అమూల్యమైన బంధం విలువను మరోసారి గుర్తు చేస్తోంది.స్నేహం అనేది రక్తసంబంధం కాదు. అయినప్పటికీ జీవితంలో ఎన్నో బంధాల కంటే గొప్పదిగా నిలిచే అనుబంధం. తల్లిదండ్రులకు, అన్నదమ్ములకు, రక్తసంబంధీకులకు కూడా చెప్పలేని మనసులోని మాటలను ఎలాంటి సంకోచం లేకుండా పంచుకునే వ్యక్తి నిజమైన మిత్రుడు. మన బాధను తన బాధగా భావించి ఓదార్చే వ్యక్తి, మన ఆనందాన్ని తన ఆనందంగా మార్చుకునే వ్యక్తి, కష్టకాలంలో అండగా నిలిచి ధైర్యం చెప్పే వ్యక్తే అసలైన స్నేహితుడు.నిజమైన స్నేహం స్వార్థం, డబ్బు, హోదా, కులం, మతం వంటి భేదాలకు అతీతంగా ఉంటుంది. జీవితంలో ఆస్తిపాస్తులు లేకపోయినా, ఆర్థికంగా సాధారణ స్థితిలో ఉన్న వ్యక్తులు కూడా మంచి స్నేహితుల సహకారం, ప్రోత్సాహం, మార్గదర్శకత్వంతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. అవసరమైన సమయంలో చేయూతనిచ్చే ఒక మంచి మిత్రుడు ఏ సంపదతోనూ పోల్చలేని విలువైన ఆస్తి. అందుకే “సంపద కంటే స్నేహితులే గొప్ప బలం అని పెద్దలు చెబుతుంటారు.నేటి సోషల్ మీడియా యుగంలో వేలాది మంది ఫ్రెండ్స్ జాబితాలో ఉన్నప్పటికీ, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే నిజమైన మిత్రులు మాత్రం కొద్దిమందే ఉంటారు. విజయాల్లో చప్పట్లు కొట్టేవారు చాలామంది కనిపిస్తారు. కానీ అపజయంలో భుజం తట్టి “నేనున్నాను అని ధైర్యం చెప్పే వ్యక్తే నిజమైన స్నేహితుడు.ఫ్రెండ్షిప్ డే అనేది కేవలం శుభాకాంక్షలు చెప్పుకునే రోజు మాత్రమే కాదు. పాత స్నేహాలను గుర్తు చేసుకోవడం, దూరమైన మిత్రులను మళ్లీ పలకరించడం, అపార్థాలను తొలగించి బంధాలను మరింత బలపరచుకోవడం, జీవితంలో స్నేహం విలువను గుర్తు చేసుకోవడం ఈ రోజు ప్రధాన ఉద్దేశ్యం.ఈ సందర్భంగా చిన్న చిన్న మనస్పర్థలు, అపార్థాలు లేదా అహం కారణంగా దూరమైన స్నేహితులు ఒక్కసారి తమ మనసునుప్రశాంతంగాప్రశ్నించుకోవాలి. ఒక చిన్న ఫోన్ కాల్, ఒక ఆప్యాయమైన సందేశం లేదా ఒక ఆత్మీయ పలకరింపు ఎన్నో సంవత్సరాలుగా దూరమైన స్నేహాన్ని మళ్లీ దగ్గర చేయగలదు. జీవితం చాలా చిన్నది. అహం కోసం విలువైన బంధాలను కోల్పోవడం కంటే, ప్రేమతో ఒక అడుగు ముందుకు వేయడం గొప్పది. ఈ ఫ్రెండ్షిప్ డే సందర్భంగా పాత విభేదాలను పక్కనపెట్టి, స్నేహితులను మరోసారి కలవడం లేదా కనీసం ఒక ఫోన్ కాల్ చేసి పలకరించడం ద్వారా స్నేహ బంధానికి కొత్త ఊపిరి పోయాలని ఈ ప్రత్యేక దినోత్సవం సందేశం ఇస్తోంది.కాలం మారినా, పరిస్థితులు మారినా, నిజమైన స్నేహం మాత్రం ఎప్పటికీ మారదు. కష్టాల్లో తోడుగా నిలిచే మిత్రుడే జీవితంలో గొప్ప సంపద. అలాంటి స్నేహితులను గౌరవించడం, వారి విలువను గుర్తించడం, స్నేహ బంధాన్ని జీవితాంతం నిలబెట్టుకోవడమే ఫ్రెండ్షిప్ డే యొక్క నిజమైన స్ఫూర్తి.బంధాలు జన్మతో వస్తాయి. స్నేహం మాత్రం మనసుతో ఏర్పడుతుంది. ఆ మనసుల కలయికే జీవితాంతం నిలిచే నిజమైన సంపద.ఫ్రెండ్షిప్ డే సందర్భంగా మా మిత్ర బృందం తరపున ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. చిన్న చిన్న విభేదాలను పక్కనపెట్టి స్నేహబంధాలను మరింత బలపరుచుకుంటూ, ప్రేమ, నమ్మకం, ఆప్యాయతలతో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా మాజీ జెడ్పిటిసి జనగామ శరత్ రావు

# కథలాపూర్ మండలంలోని పలు గ్రామాలలో నూతన కమిటీలు



**కథలాపూర్ ఆగస్టు 2(జనం సాక్షి )**కథలాపూర్ మండలంలోని పలు గ్రామాలలో ఏం ఆర్ పి ఎస్ అన్ని అనుబంధ సంఘాల నూతన కమిటీ నిర్మాణంలో భాగంగా ఏం ఆర్ పి ఎస్. నూతన గ్రామ కమిటీలను దూలుర్, బొమ్మెన, తాండ్రియాల్, గ్రామలలో ప్రకటించడం జరిగినది. ఇట్టి సమావేశాలు వేములవాడ నియోజగక ఇంచార్జీ కసవత్తుల లక్ష్మి రాజం మాదిగ పర్యవేక్షణలో జరుగుచున్నవి. ఈ సమావేశ కమిటీలకు కథలాపూర్ మండల ఇంచార్జీ మారంపెల్లి వినోద్ పాల్గొని మాట్లాడుతూఈదేశంలో దుర్మార్గమైన కుల వ్యవస్థ ఉండడం వలనే మనం అత్యంత పేదలుగా మిగిలిపోయామని, వేల సంవత్సరాల నుంచి అనుచివేతకు గురిచేసిన కుల వ్యవస్థను కూకటివేలతో కూల్చివేయాలని అన్నారు. దోపిడి వివక్షత లేని సమాజ నిర్మాణం కోసం గౌతమ బుద్ధుడు నుండి సంత్ రవిదాసుల ఆశయాల సిద్ధికై వారి అడుగుజాడల్లో తమ జీవితాలను వెచ్చించిన పూలే, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, కాన్షిరామ్ ల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ శ్రేణులు ముందుకు సాగాలని అన్నారు.మాదిగలే కాకుండా పేదరికంలో ఉన్న అణగారిన వర్గాల ఆర్థిక ఎదుగుదలకు మనమే ఉద్యమించాలని, రాజకీయ చైతన్యాన్ని, సృహను విడువకుండా కలిసొచ్చే సామాజిక శక్తులను కలుపుకొని పీడత వర్గాల విముక్తి కోసం కొత్త మార్గంలో ముందుకు సాగాలని, బలమైన ప్రజా పోరాటాలను నిర్మించాలని అందుకు గ్రామ స్తాయిలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పోరాడాలని అన్నారు.ఈ సమావేశంలో దులూరు గ్రామ మాదిగ కుల సంఘ సభ్యులు మరియు బొమ్మెన గ్రామ మాదిగ సంఘ సభ్యులు తాండ్రియాల మాదిగ సంఘ సభ్యులు, భూమా గంగారాం, కలిగోట రాజం, నల్ల గంగాధర్, అర్జున్, బాలే నీలకంఠం, సంజీవ్, ప్రశాంత్, వంశీ, ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పెద్దమ్మ తల్లి ఆషాఢ మాస బోనాలు



**రామగిరి ఆగస్టు2(జనంసాక్షి )**రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సెంటినరీ కాలనీలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ పెద్దమ్మ తల్లికి బోనాల వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం రాం నగర్ పోచమ్మ తల్లికి బోనం సమర్పించిన అనంతరం మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను అలంకరించి డప్పు వాయిద్యాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని సెంటినరీ కాలనీ ముదిరాజ్ సంఘం మరియు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇదే విధంగా ఆషాఢ మాస బోనాల వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో కుల బంధువులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారనీ తెలిపారు

# ఎనిమిదవ కాలనీలో సింగరేణి కార్మికుని ఇంట్లో చోరీ



**యైటింక్లైన్ కాలనీ, ఆగస్టు -2( జనంసాక్షి),:** ఎనిమిదవ కాలనీలోని టీ-2 క్వార్టర్స్ నం. 601లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించినట్లు సమాచారం బాధితుడు సింగరేణి కార్మికుడు ఇప్ప పాపయ్య తెలిపిన వివరాల ప్రకారం, కంటి ఆపరేషన్ నిమిత్తం మూడు రోజుల క్రితం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో నుంచి ఏయే వస్తువులు, ఎంత మేరకు చోరీకి గురయ్యాయనే వివరాలను సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను గుర్తించి పట్టుకునేందుకు దర్యాప్తు చేపట్టారు.

# గడి పాఠశాలలో ఘనంగా గోరింటాకు వేడుకలు

### వేడుకల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు



**కోరుట్ల ఆగస్టు 2(జనం సాక్షి )**కోరుట్ల మండలంలోని ప్రాథమిక పాఠశాల, ఎస్.ఆర్.ఎస్.పీ క్యాంప్ (గడి), కల్లూరు రోడ్ లో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నునావత్ రాజు మాట్లాడుతూ, గోరింటాకు మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, కుటుంబ బంధాలను, ఆనందాన్ని, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించే ఆచారమని వివరించారు. విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ రహూఫ్, పూర్ణచందర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ధనలక్ష్మి, సుమలత, సరస్వతి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని గోరింటాకు వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో సాంప్రదాయ వాతావరణం నెలకొని, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి ఈ వేడుకను విజయవంతం చేశారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన కేకే మహేందర్ రెడ్డి





**ముస్తాబాద ఆగస్టు 2 (జనం సాక్షి)**ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో రెండు బాధిత కుటుంబాలను పరామర్శించిన రాజన్న సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ , వంగ మోహనరెడ్డి గారి తండ్రి కొన్నిరోజుల క్రితం చనిపోగా వారి కుటుంబాన్నితినేటి రాంరెడ్డి గారి అన్నయ్య తినేటి మధుకు గత నెలలో బ్రెయిన్ సర్జరీ అయి ఇంట్లో రెస్ట్ తీసుకుంటున్న మధును మహేందర్. మాజీ మండల్ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి గారు పరామర్శించి ధైర్యం చెప్పటం జరిగిందిఈ కార్యక్రమం లో గ్రామశాఖ అధ్యక్షులు గంత రాజు, ఏఎంసి డైరెక్టర్ క్యారం రాజు, సింగిల్ విండో మాజీ వాయిస్ చైర్మన్ బొందుగుల దేవిరెడ్డి, వట్టిమల్ల రాజేశం, చిత్తరీ రవి, సోషల్ మీడియా యారటి భరత్ పాల్గొనటం జరిగింది

# ఘనంగా ఊర పండగ సంబరాలు

## నగరం లో ఊర పండుగ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్





**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 02:** ఆదివారం నిజామాబాద్ నగరంలో ఘనంగా నిర్వహిస్తున్న ఊర పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా , శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా , ట్రాఫిక్ రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పండుగ జరుగుతున్న ప్రధాన ప్రాంతాలు , ఊరేగింపు మార్గాలు రద్దీ కూడళ్లు , ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాలు , పార్కింగ్ స్థలాలను సందర్శించి పోలీసు అధికారులు , సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని , ప్రతి సున్నిత ప్రాంతంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.పండుగకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశమున్నందున మహిళలు , చిన్నారులు , వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని , అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా పోలీసు బృందాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి , అంబులెన్స్‌లు , అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పండుగ ప్రాంతమంతా సీసీ కెమెరాలు మరియు డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని , అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. పికెట్‌లు , మొబైల్ పెట్రోలింగ్ బృందాలు , షీ టీమ్స్ , ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేసి భక్తులకు భద్రత కల్పించాలని సూచించారు.అలాగే ఊరేగింపు సమయంలో ప్రజలు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని , ట్రాఫిక్ మళ్లింపులకు సహకరించాలని , పిల్లలను ఒంటరిగా వదిలివేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని , అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ శాఖ అన్ని విధాలుగా విస్తృత బందోబస్తు చర్యలు చేపట్టిందని , ప్రజల సహకారంతో పండుగ విజయవంతంగా నిర్వహించగలమనే విశ్వాసాన్ని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నిజామాబాదు , సి.సి.ఆర్.బి , సి.సి.ఎస్ ఎ.సి.పి లు ప్రకాష్ యాదవ్ గురు నాయుడు , శ్రీశైలం , ట్రాఫిక్ సిఐ ప్రసాద్ , టౌన్ సిఐ శ్రీనివాసరాజ్ , సౌత్ రూరల్ సిఐ , సురేష్ కుమార్ ఎస్.హెచ్.ఓ రఘు పతి మరియు ఎస్.ఐ లు , స్పెషల్ పార్టీ సిబ్బంది , పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాధాకిషన్ మోదాని బలిదినోత్సవం ? వందేమాతరం 150వ వార్షికోత్సవం

### పాల్గొన్న నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 02 జనంసాక్షి :** ఆర్య సమాజ్ అనుబంధ సంస్థ షహీద్ రాధాకిషన్ శిక్షా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కంటేశ్వర్ రైల్వే కమాన్ సమీపంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ రాధాకిషన్ మోదాని బలిదినోత్సవం,వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ హాజరై నివాళులర్పించారు.కార్యక్రమానికి ముందు నగర మేయర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది కార్యక్రమ ప్రాంగణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ సందర్భంగా మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని అన్నారు. షహీద్ రాధాకిషన్ మోదాని వంటి మహనీయుల దేశభక్తి, త్యాగనిరతి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. భారత జాతీయ చైతన్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన వందేమాతరం గీతం ప్రతి భారతీయుడిలో దేశభక్తిని నింపుతుందని, దాని 150వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధి, జాతీయ సమైక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మఠం రేవతి,సిటీ జనరల్ సెక్రటరీ స్వప్న , రాధాకిషన్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఆర్య సమాజ్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం దేశభక్తి నినాదాలు, వందేమాతరం గీతాలాపనతో ఉత్సాహభరితంగా సాగింది.

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 02: జనంసాక్షి** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదివారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి వారికి పుష్ప గుచ్చం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ప్రజలకు సేవ చేసేందుకు భగవంతుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరారు.రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరుపున నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాట్ పల్లి నగేష్ రెడ్డి , రాష్ట్ర పి ఏ సి కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ , రాష్ట్ర ఊర్దు అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్ , మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి , మాజీ పార్టీ అధ్యక్షులు మానల మోహన్ రెడ్డి ,డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి , పురన్ రెడ్డి , విద్యాసాగర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఊర పండగ

○వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్

○సామరస్యానికి ప్రతీకగా నిలిచే సంప్రదాయ ఉత్సవాలు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 02: జనం సాక్షి** నిజామాబాద్ నగరంలో సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఊర పండగ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహక కమిటీ సభ్యులు, ప్రజలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మేయర్ కూరగాయల మాట్లాడుతూ, ఊర పండగ అనేది కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాకుండా, అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే సామాజిక ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న సాంప్రదాయాలను, ఆచారాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇలాంటి ఉత్సవాలు పరస్పర ప్రేమ, సోదరభావం, సామాజిక సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు.నగర అభివృద్ధితో పాటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కూడా నగర పాలక సంస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మేయర్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో జరిగే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతకు మన సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేస్తాయని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో సిటి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మఠం రేవతి, సిటీ జనరల్ సెక్రటరీ స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్వ సమాజ్ కమిటీ సభ్యులు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు, పెద్దలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.వేడుకల సందర్భంగా సాంప్రదాయ కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం నిర్వాహకులు నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ ని ఘనంగా సత్కరించగా, మేయర్ కమిటీ సభ్యుల సేవలను అభినందిస్తూ, ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని ఆకాంక్షించారు. ఊర పండగ వేడుకలు భక్తి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలిచి నగరంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.

## పెగడాపల్లిలో ఘనంగా ఊర పండుగ

### 12 సంవత్సరాల తర్వాత నిర్వహణ:పోటెత్తిన గ్రామస్తులు



**బోధన్, ఆగస్టు 2 ( జనంసాక్షి ) :** బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. 12 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్న ఊర పండుగకు గ్రామంలోని ప్రతి కులాలకు చెందిన మహిళలు ప్రజలు ఆలయాల వద్ద పోటెత్తారు. గ్రామంలోని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బలి సైతం నిర్వహించడం జరిగింది. గ్రామంలోని గ్రామదేవతలు గ్రామంపై కరుణ చూపడంతో పాటు పాడిపంటలు సమృద్ధిగా పండాలని వర్షాలు బాగా కురవాలని కోరుతూ గ్రామస్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎంతో వైభవంగా నిర్వహించిన ఊర పండుగలో గ్రామ సర్పంచ్ మద్ది రచన సుదర్శన్, ఉప సర్పంచ్ షబ్బీర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారడి సాయిబాబా, గ్రామస్తులు దొనకంటి లక్ష్మారెడ్డి, పోతరెడ్డి, మంద సంజీవ్, రామయ్య, రవి, సాయిలు, సాయిబాబ, కృష్ణ రెడ్డి, వేణుగోపాల్ తో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు అండగా మంత్రి శ్రీధర్ బాబు

### నేడు మన ఊరు - మన కోచింగ్ సెంటర్ ప్రారంభించనున్న మంత్రి



**మంథని, ఆగస్టు 02, (జనంసాక్షి ):** రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం మంథని నియోజకవర్గంలో విస్తృత పర్యటన చేపట్టనున్నారు. విద్య, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధి, వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు మంథనిలోని శివకిరణ్ గార్డెన్‌లో మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'మన ఊరు--మన కోచింగ్ సెంటర్' ఉచిత కానిస్టేబుల్, ఎస్సై కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో టీ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు ఉచిత హెల్మెట్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 10.30 గంటలకు మంథని క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్, కోకాకోలా ఫ్యాక్టరీ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో కలిసి అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు బొక్కల వాగు అభివృద్ధికి సంబంధించిన ప్రజెంటేషన్‌లో కంపెనీ ప్రతినిధులతో కలిసి పాల్గొని ప్రతిపాదిత పనులపై చర్చించనున్నారు. ఉదయం 11. 30 గంటలకు మంథని ప్రభ ుత్వ సివిల్ ఆసుపత్రిలో నూతన డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని ప్రభుత్వ వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష చేపట్టనున్నారు.తదుపరి మధ్యా హ్నం 12 గంటలకు రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటు కోసం ఎంపిక చేసిన స్థలాన్ని జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించనున్నారు. మంత్రి శ్రీధర్ బాబు పర్యటనతో మంథని ప్రాంతంలో విద్య, ఉపాధి, వైద్య సేవలు, పారిశ్రామిక పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై పురోగతి సాధించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## ఎస్ఐఆర్ విజయవంతం చేసిన క్లస్టర్ ఇన్‌చార్జీలు, బీఎల్ఏలకు ఘన సన్మానం



**కమాన్‌పూర్, ఆగస్టు 2, (జనంసాక్షి ):** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతంగా పూర్తి చేయడంలో విశేష కృషి చేసిన క్లస్టర్ ఇన్‌చార్జీలు, బీఎల్ఏలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు సూచనల మేరకు ఆదివారం కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమానికి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన క్లస్టర్ ఇన్‌చార్జీలు, బీఎల్ఏలను అభినందించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తల సమిష్టి కృషి ఎంతో అవసరమని పేర్కొంటూ, ఇదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఎస్.ఎస్. అన్వర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి అహర్నిశలు శ్రమించిన ప్రతి కార్యకర్తకు పార్టీ తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గుర్తించి గౌరవిస్తుందని, వారి సేవలకు తగిన గుర్తింపు లభించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యకర్తల అంకితభావమే పార్టీకి బలమని, ప్రజల మధ్య పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపదమొక్కుల తల్లికి బోనాల సమర్పణ

### అమ్మవారికి బోనాలు సమర్పించుకున్న మహిళలు

**సిరిసిల్ల టౌన్ ఆగస్టు2(జనం సాక్షి)** రాష్ట్రవ్యాప్తంగా ఆషాడమాసాన్ని పురస్కరించుకుని పిల్లాపాపలు చల్లంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలుపండాలని కోరుకుంటూ, ప్రజలు ఇంటింటికి బోనం తీసి ఆపదమొక్కుల తల్లిని వేడుకుంటూ శివసత్తుల మధ్య, బైండ్లవారి డప్పు చప్పులతో ఊరురా వాడవాడలో ఆడపడుచులు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలి వెళుతూ మొక్కులు సమర్పించుకుంటున్నారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో ప్రజలు బోనాల జాతరను అత్యంత ప్రాముఖ్యంగా జరుపుకుంటారు. బంధువుల సందడితో ప్రతి ఇల్లు కళకళ లాడుతుంటుంది.అమ్మవారికి మొక్కులు సమర్పించు కోవడం ఆనాదిగా వస్తుంది.పంట చేతికి వచ్చి ఇల్లు చేరి చేరగానే ఆషాడ మాసంలో ప్రతి ఇల్లు పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటుంది. బహుజనుల పండుగగా బోనాల పండుగ ఖ్యాతి గడించింది. అమ్మవారికి మొక్కులు సమర్పించుకోవడం ఆనాదిగా వస్తుంది. ఊరి పొలిమేరలోనున్న పోచమ్మ,, మైసమ్మ, మహంకాళి, తల్లులకు బోనాలు తీస్తూ కుటుంబ సభ్యులతో సంబురాలు జరుపుకుంటారు..మహంకాళి జాతర బోనాలు .ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని సిరిసిల్లలోని మాండవ్య నదీ తీరాన వెలిసిన నెహ్రూ నగర్ అంబాభవాని దేవాలయం వద్దనున్న మహంకాళి దేవాలయంలో అమ్మవారికి ఘనంగా బోనాలు భక్తులు సమర్పించారు. కన్నుల పండువగా ఊరేగింపు .నెహ్రూనగర్ కు చెందిన మహిళలు ఇంటింటి బోనం తీసి, బోనాలు ఎత్తుకొని వాడవాడలో ఊరేగింపుగా డబ్బు చప్పుల మధ్య, పోతరాజుల ఆటపాటలతో, మహంకాళి దేవాలయానికి చేరుకుని ఘనంగా బోనాలు తీశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ చైర్మన్ చిలుక నారాయణ, కౌన్సిలర్ దూడం రజనీ శ్రీనివాస్ లు మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలోని అంబ భవాని దేవాలయం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా భక్తిశ్రద్ధలతో బోనాలు తీయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చిమ్మని ప్రకాష్, సిరిసిల్ల రవీందర్, తాటి వెంకన్న, బూర భాస్కర్ (బాబి), కట్ల సంజీవ్ ఆడెపు సంపత్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.







# నిస్వార్థ సేవకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి

### అందరి హృదయాలను గెలిచిన గొప్ప నాయకుడు



**మంథని, ఆగస్టు 02, ( జనంసాక్షి ) :** ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేకుండా నిస్వార్థంగా సేవలు అందించిన గొప్ప సేవకుడు మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ఆదివారం అమెరికాలో జరిగిన పెద్ది సుదర్శన్‌రెడ్డి సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత అనేక ఏండ్లు పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి ప్రయాణం చేశానని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరితో కలిసి పోయే మనస్తత్వం ఆయనదని, ఆయన తీరుతో అందరి హృదయాలను గెలుచుకున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మృతి చెందడంతో బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం సైతం గొప్పగా స్పందించి అండగా నిలిచిందని, అలాంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం అందరికి బాధాకరమన్నారు. తాను అమెరికా పర్యటనలో ఉన్న మూలంగా పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమ యాత్రలో లేకపోవడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలో పెద్ది సుదర్శన్‌రెడ్డి సంతాప సభ నిర్వహించడం, ఆ సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం మరిచిపోనని అన్నారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అమరవీరులకు జోహర్లు అర్పిస్తూ పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## పోతన కాలనీలో గ్యాస్ సిలిండర్ పేలుడు

### దంపతులకు తీవ్ర గాయాలు



**యైటింక్లైన్ కాలనీ, ఆగస్టు -2 ( జనంసాక్షి ) :** : పోతన కాలనీలోని 83వ బ్లాక్, ఇంటి నెం. 1151లో ఆదివారం గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా జరిగిన పేలుడు తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. వకీల్‌పల్లి గనిలో ఉద్యోగిగా పనిచేస్తున్న యాదవనేని వసంత్ తన నివాసంలో ఉండగా, పూర్తిగా గ్యాస్‌తో నిండిన సిలిండర్‌కు లీకేజీ ఏర్పడి ఒక్కసారిగా పేలింది. ఈ ఘటనలో వసంత్‌తో పాటు ఆయన భార్య విజ్ఞత తీవ్రంగా గాయపడ్డారు.పేలుడు ధాటికి ఇంటిలోని సామగ్రి దెబ్బతినగా, స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. గ్యాస్ లీకేజీ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## సర్పంచ్ లచ్చయ్యకు ఘన నివాళులు



**ముస్తాబాద్ ఆగస్టు 02 (జనం సాక్షి)**ఆర్యవైశ్య అధ్యక్షుడు మా శెట్టి లచ్చయ్య గత కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. లచ్చయ్య మండలం లోని చిప్పలపల్లి గ్రామానికి సర్పంచిగా గెలిచి తెలంగాణ రాష్ట్రంలోనే ఒకే ఒక్క ఆర్యవైశ్య సర్పంచిగా నిలిచాడు. బిఆర్ఎస్ పార్టీలో పార్టీ పుట్టినప్పటి నుండి కీలక పాత్ర పోషిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి తాజా ఎమ్మెల్యే కేటీఆర్ అభిమానాన్ని చూరగొన్నాడు. మండలంలో గల ఆర్యవైశ్యులందరి అభిమానం చురగొని మండల అధ్యక్షుడు అయ్యాడు. ఎమ్మెల్యే కేటీఆర్, మండల పార్టీ నాయకుల,ఆర్యవైశ్యు సభ్యుల సహాయ సహకారాలతో మండల కేంద్రంలో సంఘ భవనమును నిర్మించాడు. పలు పార్టీల నాయకులతో, గ్రామ ప్రజలతో కలివిడిగా ఉంటూ, ఎవరికైనా ఆపద వచ్చినచో నేనున్నాను ధైర్యం అందించేవాడని గ్రామస్తులు తెలిపారు. ముస్తాబాద్ మండల ఆర్యవైశ్య సోదరులు, నాయకులు ప్రజా ప్రతినిధులు ప్రగాడ సంతాపం వ్యక్తం చేశారు. కూర సంతోష్, కూర బిక్షపతి, బండారి సత్తయ్య, కొండాపూర్ శ్రీనివాస్, రాజు,పప్పుల శ్రీకాంత్, గందె చంద్రం, ఉప్పల చంద్రం, మురికి వెంకటేశం, మురం శెట్టి బాల్ రాజు, చేపూరి రమేష్ గందె రమేష్, గంప సుధాకర్, మేడిశెట్టి రాజు, పాల్గొన్నారు

# విషాదంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచిన నగర మేయర్

**శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో మృతి చెందిన ముగ్గురు యువకుల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పిన మేయర్**

**ప్రభుత్వ సహాయానికి కృషి చేస్తానని హామీ**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 02 జనం సాక్షి**

ఇటీవల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో చోటుచేసుకున్న విషాద ఘటనలో ముస్లిం వర్గానికి చెందిన ముగ్గురు యువకులు దురదృష్టవశాత్తు మృతి చెందడం జిల్లా వ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో నగర మేయర్ కూరగాయల ఉమారాణి బాధిత కుటుంబాల నివాసాలకు వెళ్లి వారిని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖంలో భాగస్వాములై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, అమాయక యువకుల అకాల మరణం అత్యంత బాధాకరమని, ఈ ఘటనతో మూడు కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోయి తీవ్ర వేదనలో ఉన్నాయని అన్నారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులుగా బాధిత కుటుంబాలకు అండగా నిలవడం తమ నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన మేయర్, వారి సమస్యలను తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని ఆ కుటుంబాలకు భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తూ, మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా బాధిత కుటుంబాలకు సంఘీభావం ప్రకటిస్తూ, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధలో ఉన్న కుటుంబాలను స్వయంగా పరామర్శించి ధైర్యం చెప్పిన నగర మేయర్ కూరగాయల



ఉమారాణి మానవీయ స్పందనను స్థానికులు, కాంగ్రెస్ శ్రేణులు అభినందించారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలవడం ప్రజాప్రతినిధుల అసలైన బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మహమ్మద్ సమీ , అబ్దుల్ వహీద్, అబ్దుల్ ఖయ్యూం, షేక్ జాఫర్, షకీల్, వాహద్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సలహాదారుడు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు

కమ్మర్పల్లి ఆగస్టు 02(జనంసాక్షి)

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆదివారం రోజున కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనగిరి భాస్కర్ మాట్లాడుతూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అలుపెరుగని నాయకుడని ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే గొప్ప వ్యక్తి అని కొనియాడారు. జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య,వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, మాజీ అధ్యక్షుడు సుంకేట రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలేటి మోహన్,జిల్లా కిషన్ కేత్ ఉపాధ్యక్షులు పడిగేలా ప్రవీణ్, జిల్లా నాయకులు మురళి,దేవేందర్,శ్రీనివాస్ ఉప్లూర్ సర్పంచ్ శైలేందర్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నరేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్ముల రవీందర్, లక్ష్మణ్,గణేష్,శేఖర్,రవి,ముఖిమ్ కార్యకర్తలు పాల్గొన్నారు.




# రివర్స్ పంపింగ్ ద్వారా వరద కాలువలోకి నీళ్లు

**❑వెంటనే వరద కాలువ తుములు ఆన్ చేసి చెరువులు నింపాలి ❑ కమ్మర్పల్లి పి ఎస్ సి ఎస్ చైర్మన్ రేగుంట దేవేందర్**

**కమ్మర్పల్లి ఆగస్టు 02(జనంసాక్షి)**

రివర్స్ పంపింగ్ ద్వారా వరద కాలువలోకి నీళ్లు తీసుకువచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దేఅని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పి ఎస్ ఎస్ చైర్మన్ రేగుంట దేవేందర్ పేర్కొన్నారు. ఆదివారం రోజున కమ్మర్పల్లి, మోర్తాడ్ సరి హద్దుల వరద కాలువలోకి రివర్స్ పంపింగ్ ధ్వారా కాళేశ్వరం ప్రాజెక్టు గోదావరి జలాల ద్వారా రావడంతో కెసిఆర్, ప్రశాంత్ రెడ్డి చిత్రపటాలకు కమ్మర్పల్లి మోర్తాడ్ మండల రైతాంగం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రేగుంట దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం చేసి స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడమే కాకుండా సాధించుకున్న స్వరాష్ట్రాన్ని నిధులు, నియామకలతో పాటు నీళ్ల సమస్యను పరిష్కరించడానికి కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును తలపెట్టారని ఈ ప్రాంత ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఇక్కడ రైతాంగనీ పడుతున్న ఇబ్బందుల గురించి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే అధికారులతో సర్వే చేయించి రివర్స్ పంపింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చిన ఘనత కేవలం కేసీఆర్ దేనని కొనియాడారు. వరద కాలువలో రివర్స్ పంపింగ్ ద్వారా నీళ్లు ఉండడంతో ఇక్కడి రైతాంగం లిఫ్ట్ మోటార్ పెట్టుకొని రబి,ఖరీఫ్ రెండు పంటలకు పుష్కలంగా నీళ్లు అందుతున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు అనీ అన్నారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వమైనా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం కూలిపోయిందని మోటార్లు కాలిపోయాయని రివర్స్ పంపింగ్ చేయకుండా ఎండబెట్టారని గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ నాయకులు చేసిన దుష్ప్రచారానికి ఇవ్వాలా వరద కాలువలోని పారుతున్న నీళ్లే సమాధానం చెప్పాయని అన్నారు. రైతు పక్షపాతి అయిన



కెసిఆర్,వేముల ప్రశాంత్ రెడ్డికి ఆయకట్టు రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ సి ఎస్ చైర్మన్లు బద్దం అశోక్ రెడ్డి, కమ్మర్పల్లి మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, మాజీ ఎంపిటిసి లు పిప్పర అనిల్,అశోక్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రెంజర్ల మహేందర్,ఆవిరి మురళి,సంత రాజేశ్వర్,బద్దం రాజేశ్వర్,ప్రభుదాస్,గంగారెడ్డి, రఘు టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం

**ఐదుగురితో మొదలై వందలమంది నవ యువ యూత్ గా ఏర్పాటు**

**స్నేహితుల రోజు సందర్భంగా నవ యువ యూత్ కార్యక్రమాలు**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 02: జనం సాక్షి**

(గడ్కోల్)నిజామాబాద్ జిల్లా మారుమూల మండలం అయిన సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో నవ యువ యూత్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి నేటికీ మూడు సంవత్సరాల కాలం పూర్తయిన సందర్భముగా యూత్ సభ్యులు తమ సంస్థ కార్యకలాపాల గురించి జనం సాక్షితో పంచుకున్నారు. చిన్న గ్రామంలో కుల మతాలకతీతంగా 40 సంవత్సరాల బాల్య స్నేహం పెరిగి పెద్దదై 2023 సంవత్సరంలో ఐదుగురు స్నేహితులు కలిసి రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గ్రామంలోనే ఆదర్శంగా నిలిచారు. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని గతంలో గ్రామంలోని ప్రజలందరూ ఏకమై అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పంతో ఉన్న యువతను నీరుగార్చి గ్రామంలో ఎక్కడ విగ్రహం ఏర్పాటు చేయడానికి వీలులేదని అనేక ఆంక్షలు విధించారు. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో ప్రస్తుత సర్పంచ్ సంద్ర లత భర్త శంకర్ గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన రోజు గ్రామ నడిబొడ్డులో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేయడంతో గ్రామస్తులంతా ఏకమై విగ్రహ ఏర్పాటును నిలిపి వేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా చలించకుండా తన బాల్య స్నేహితులైన ఐదుగురితో కలిసి నవ యువ యూత్ ను ఏర్పాటు చేసి 50 మంది యువకులతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. యువత తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని నవ యువ యూత్ సభ్యులు నిరూపించారు.

# భీంగల్ మండల కేంద్రంలో ఊరురా బోనాల పండుగ శోభ



భీంగల్ రూరల్,ఆగష్టు 2 (జనం సాక్షి)

భీంగల్ పట్టణ, మండలంలోని ప్రతి గ్రామంలో బోనాల పండగ ఉత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. గ్రామాలలోని ప్రజలు, కుల సంఘాల వారిగా ప్రతి సంవత్సరం వర్షాకాల సమయంలో డప్పు చప్పుల్లు, బోనాల ఊరేగింపు మధ్య అత్యంత భక్తి శ్రద్ధలతో నైవేద్యాని సమర్పించి గ్రామ దేవతలను పూజిస్తారు. ఈ పండగ ముఖ్య ఉద్దేశ్యం సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని గ్రామ దేవతలను భక్తులు కోరుకుంటారు. బోనాల పండుగ తెలంగాణా ప్రాంత సంస్కృతిని, సాంప్రదాయాన్ని ప్రతిబింభించే పండుగ. ఈ పండగ రోజు సూదూర ప్రాంతాలలో, పట్టణాలలో నివసిస్తున్న ఉద్యోగులు, వ్యాపారస్థులు తమ తమ ఇంటికి చేరుకొని బోనాల పండుగలో పాల్గొన్ని, కుటుంబ సభ్యుల నడుమ పిల్ల పాపలతో ప్రకృతి అందాల మధ్య ఆహ్లాదంగా గడుపుతారు. అలాగే భీంగల్ మండలం జాగిర్యాల్ గ్రామంలో కూడ బోనాల పండుగ ప్రతి సంత్సరం లాగే ఈ సంవత్సరం కూడా బాగా జరిగిందని గ్రామ సర్పంచ్ గడాల ప్రసాద్, బీఆర్ఎస్ యువ నాయకులు పి. శ్రీనివాస్,కిషన్ లు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో మెగా రక్తదాన శిబిరం



**బోధన్, ఆగస్టు 2 ( జనంసాక్షి ) :** బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జన్మదిన పుష్కరించుకొని అంబేద్కర్ చౌరస్తాలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి జన్మదిన శుభ సందర్భంగా సేవా కార్యక్రమాలను 2005 సంవత్సరం నుండి ఇప్పటివరకు కొనసాగిస్తూ వస్తున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గత 21 సంవత్సరాలుగా నిరంతరంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం (బ్లడ్ డొనేషన్) నిర్వహించారు. బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి నమ్మిన బంటుగా గుర్తింపు సాధించడంతోపాటు ఆయన ఆదేశాలను తూచా తప్పకుండా పాటించడం, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డికే సాధ్యమని ప్రతి ఒక్కరు అనుకుంటున్నారు. అంతేకాకుండా బోధన్ ఉమ్మడి మండలంలో యూత్ కాంగ్రెస్ నాయకులను ఏకతాటిపై తీసుకొని రావడంతో పాటు పెద్ద ఎత్తున పార్టీ కార్యక్రమాలను నిర్వహించడంలో ఆయనకు సాటి ఎవరు లేరని నాయకులు బాటంగా చెబుతున్నారు. ఈ మేరకు నేడు సైతం తన సొంత ఖర్చులతో బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలిచాడు అనేది అక్షర సత్యం. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దాము, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ పద్మ శరత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, మందర్న రవి, కల్దుర్కి సహకార సంఘం చైర్మన్ గింజుపల్లి శరత్, జిల్లా ఉపాధ్యక్షులు పాషా, ఖాజాపూర్ అశోక్, ఎన్ఐసీయూ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## హున్సలో బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**బోధన్, ఆగస్టు 2 ( జనంసాక్షి ) :** నిజామాబాద్ జిల్లా సాలూర మండలం హున్స గ్రామంలో బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవి, మండల కాంగ్రెస్ నాయకులు, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, సర్పంచ్ శివకుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని సోమేశ్వర ఆలయంలో తమ అభిమాన నేత నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. బోధన్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చీల శంకర్ తన సొంత ఖర్చులతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా చీల శంకర్, గ్రామ సర్పంచ్ శివకుమార్ మాట్లాడుతూ, తమ అభిమాన నేతకు రైతులు అన్నా విద్యార్థులు అన్న ఎనలేని ప్రేమని దుబారా ఖర్చులు చేయకుండా ప్రభుత్వ విద్యార్థులకు నోటుబుక్కులను పంపిణీ చేయడం జరిగిందని ఇలా చేయడం వల్ల తమ అభిమాన నేత ఆనందిస్తారని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# గునుకులపల్లిలో వైభవంగా పోచమ్మ బోనాలు

### భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు




**చిగురుమామిడి ఆగస్టు 2 (జనంసాక్షి):**మండలంలోని గునుకులపల్లె గ్రామంలో పోచమ్మ బోనాల ఉత్సవాలను ఆదివారం అత్యంత వైభవంగా,భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు.ఏటా నిర్వహించే ఈ సాంప్రదాయ పండుగకు గ్రామ ప్రజలు బంధుమిత్రులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఉదయం నుంచే మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి,పసుపు,కుంకుమలతో అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకుని,డప్పు చప్పుళ్ళు యువకుల కేరింతలు,బైండ్ల వారి నృత్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.పోచమ్మ తల్లికి బోనాల నైవేద్యాన్ని సమర్పించి,ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ గునుకుల మధుసూదన్ రెడ్డి,మాజీసర్పంచ్ గునుకుల అమూల్య రెడ్డి అమ్మవారికి పసుపు కుంకుమలతో పట్టు వస్త్రలను సమర్పించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామం పాడిపంటలతో వర్ధిల్లాలని,ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.వరుణ దేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురిసెలా చూడు తల్లో అంటూ ప్రత్యేక పూజలు చేశారు.గ్రామస్తులందరూ ఐకమత్యంతో ఈ ఉత్సవాలను విజయవంతం చేయడం అభినందనీయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి,ఉత్సవ కమిటీ సభ్యులు గునుకుల రాజిరెడ్డి,కరివేద రవీందర్ రెడ్డి,గునుకుల రవీందర్ రెడ్డి,వెన్నం రాజిరెడ్డి,ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి,కరివేద జగ్గారెడ్డి,కరివేద మల్లారెడ్డి,కాంతల ప్రవీణ్ రెడ్డి,ఒంటెల వెంకట్ రెడ్డి,సన్నిళ్ల మల్లేశం,బత్తిని నారాయణ,కమలాకర్ రెడ్డి ,లక్ష్మారెడ్డి,కాంతల రాంరెడ్డి,సురేందర్ రెడ్డి,రాజయ్య,వెన్నం భూపతిరెడ్డి,తిరుపతిరెడ్డి,వార్డు సభ్యులు గునుకుల చంద్రశేఖర్ రెడ్డి,బత్తిని స్వామి,గునుకుల సావిత్రి,స్థానిక నాయకులు, మహిళలు,యువకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై పురుగుల మందు తాగి బీహార్ కూలీ మృతి



**ఇల్లంతకుంట ఆగస్టు 02(జనంసాక్షి )**ఇల్లంతకుంట మండలం కేసనపల్లి గ్రామంలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న బీహార్ రాష్ట్రం , రత్న మహా జిల్లా కగారియా గ్రామానికి చెందిన రఘు సదా తండ్రి బిల్లా సదా వయసు 27 అను వ్యక్తి నెల రోజుల క్రితం కూలి పని నిమిత్తం కుటుంబం తో సహా కేశనపల్లి గ్రామానికి రావడం జరిగింది. గత నాలుగు రోజులుగా మృతుడు మద్యం తాగుతూ ఇంటికి వచ్చి తాగిన మైకంలో తన భార్య సవీణ కుమారిని కొట్టేవాడు, ఇదే క్రమంలో జులై 31శుక్రవారం రోజున రాత్రి 9 గంటల సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు , అది గమనించిన అతని సహచరులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రోజున మరణించినాడు. మృతుడికి ఒక కూతురు, ఒక కొడుకు కలరు. భార్య సవిన కువ వారి ఫిర్యాదు మేర కు కేసు నమో దుచేసి విచారణ చేయుచున్నా ము అని ఎస్సై అశోక్ తెలిపారు

## నకిలీ రసీదు అని పోలీసులకు కార్యదర్శి ఫిర్యాదు




**మల్యాల ఆగస్టు 2 (జనం సాక్షి) :**సర్వాపూర్ గ్రామానికి చెందిన అనిల్ అనే వ్యక్తి ఇల్లు వేరే వ్యక్తికి అమ్మేసినా కానీ తను ఇంటి పన్ను కట్టినట్లుగా రసీదు తయారుచేసి కార్యాలయ స్టాంపు మరియు కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లుగా పంచాయతీ కార్యదర్శి గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.రసీదు కార్యాలయానికి చెందినది కాదని విచారణ జరిపించాలని కోరాడు.



## అవునూరు గ్రామంలో సూర్య నమస్కారాల పోటీలు విజయవంతం

**ముస్తాబాద ఆగస్టు 02 (జనం సాక్షి):**ముస్తాబాద్ మండలం అవునూరు గ్రామంలోని రైతు వేదిక వద్ద ఆదివారం ఉదయం 6:30 గంటలకు సూర్య నమస్కారాల కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో సూర్య నమస్కారాలు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు.పోటీల్లో ఎలిగేటి కృష్ణ 116 సూర్య నమస్కారాలు చేసి ప్రథమ స్థానం సాధించారు. విఘ్నేష్ 102 సూర్య నమస్కారాలతో ద్వితీయ స్థానం, ప్రసాద్ 84 సూర్య నమస్కారాలతో తృతీయ స్థానం పొందారు.అలాగే సిద్ధార్థ, అక్షిత, అరుణ్ తదితరులు కూడా సూర్య నమస్కారాల్లో ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సందేశం ఇచ్చారు.ఈ సందర్భంగా నిర్వాహకులు సర్పంచ్ రవి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోజూ సూర్య నమస్కారాలు చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, గ్రామస్థులందరూ యోగా సాధనను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# మహంకాళి జాతర బోనాలు



**సిరిసిల్ల టౌన్ ఆగస్టు 2 (జనం సాక్షి)**ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని సిరిసిల్లలోని మాండవ్య నదీ తీరాన వెలిసిన నెహ్రూ నగర్ అంబాభవాని దేవాలయం వద్దనున్న మహంకాళి దేవాలయంలో అమ్మవారికి ఘనంగా బోనాలు భక్తులు సమర్పించారు. నెహ్రూ నగర్ కు చెందిన మహిళలు ఇంటింటి బోనం తీసి, బోనాలు ఎత్తుకొని వాడవాడలో ఊరేగింపుగా డబ్బు చప్పుల్ల మధ్య, పోతరాజుల ఆటపాటలతో, మహంకాళి దేవాలయానికి చేరుకుని ఘనంగా బోనాలు తీశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చిలుక నారాయణ, కౌన్సిలర్ దూడం రజనీ శ్రీనివాస్ లు మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలోని అంబ భవాని దేవాలయం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా భక్తిశ్రద్ధలతో బోనాలు తీయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చిమ్మని ప్రకాష్, సిరిసిల్ల రవీందర్, తాటి వెంకన్న, బూర భాస్కర్ (బాబి), కట్ల సంజీవ్ ఆడెపు సంపత్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

## మహమ్మద్ ఇలియాస్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 2, (జనం సాక్షి) దోమకొండ మండల కేంద్రంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక చాముండేశ్వరి దేవి ఆలయానికి చేరుకున్న మహమ్మద్ ఇలియాస్‌కు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ప్రజల భక్తి, ఐక్యత, సామాజిక సామరస్యానికి నిదర్శనమని అన్నారు. మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కలగాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం తెలంగాణ గొప్ప సంప్రదాయమని పేర్కొన్న ఆయన, మతసామరస్యం, పరస్పర గౌరవం తెలంగాణ సమాజానికి ప్రత్యేక గుర్తింపని అన్నారు. అన్ని మతాలను, అన్ని పండుగలను సమాన గౌరవంతో జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని చెప్పారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మహమ్మద్ ఇలియాస్‌ను ఘనంగా సన్మానించి, కార్యక్రమానికి హాజరైనందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్, ఇంద్రకరణ్ రెడ్డి, ఐరేని సందీప్, భీమ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఐరేని నర్సయ్య, సుదర్శన్, అనంతరెడ్డి, ఆశ బోయిన శ్రీనివాస్, పాత రాజు, నౌసి లాల్ నాయక్, గంప ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళలు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## మహమ్మద్ ఇలియాస్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు2 (జనం సాక్షి)**

కామారెడ్డి నియోజకవర్గంలోని బిక్నూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీ మహంకాళి మాత బోనాల ఉత్సవాలు, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం, ఊర పండుగ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా మహమ్మద్ ఇలియాస్ గ్రామంలోని శ్రీ మహంకాళి మాత ఆలయాన్ని సందర్శించి, ఆలయ అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహంకాళి అమ్మవారి కృపతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగలు, ఊర పండుగలు ప్రజల్లో భక్తి, ఐక్యత, సామరస్య భావాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలు గ్రామీణ జీవన విధానానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంతో పాటు యువతకు మన సంప్రదాయాల గొప్పతనాన్ని పరిచయం చేస్తాయని అన్నారు. కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మహమ్మద్ ఇలియాస్‌ను ఘనంగా సన్మానించి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి వేడుకల్లో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్, ఇంద్రకరణ్ రెడ్డి, ఐరేని సందీప్, భీమ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఐరేని నర్సయ్య, సుదర్శన్, అనంతరెడ్డి, ఆశ బోయిన శ్రీనివాస్, పాత రాజు, నౌసి లాల్ నాయక్, గంప ప్రసాద్, ప్రదీప్, స్వామి, గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళలు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బస్వాపూర్ లో శ్రీమహంకాళి మాత బోనాలు ఉత్సవాలు

### ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు మహమ్మద్ ఇలియాస్

భిక్కనూరు ఆగస్టు 02 (జనం సాక్షి):

తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఆషాడ మాసం బోనాల పండుగ పురస్కరించుకొని భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీ మహంకాళి మాత బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా పోతరాజుల విన్యాసాలతో డప్పు చప్పులతో పలు వీధుల గుండా అలంకరించిన బోనాలను మహిళలు ఎత్తుకొని అమ్మవారి దేవాలయానికి చేరుకున్నాయి, అనంతరం ఊర పండగ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ఏర్పట్లు చేశారు ఈ కార్యక్రమానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ కు గ్రామస్తులు స్వాగతం పలికారు, అనంతరం శ్రీ మహంకాళి మాత అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా మహమ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకగా నిలిచే బోనాల పండుగలు, ఊర పండగలు ప్రజల్లో ఐక్యతను భక్తి భావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు, గ్రామ పెద్దలు ఇలియాస్ ను ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పిసిసి కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాగన్న గారి నరేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు భీమ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ తుడుం పద్మ స్వామి,ఉపసర్పంచ్ కార్తిక్ రెడ్డి, యువజన సంఘాల నాయకులు ప్రజా ప్రతినిధులు మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నవాబుపేటలో వైభవంగా మహంకాలమ్మ,పోచమ్మ బోనాలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించిన మహిళలు..
- గ్రామంలో పండుగ వాతావరణం,పోటెత్తిన భక్తులు





**చిగురుమామిడి ఆగస్టు 01 (జనంసాక్షి):** మండలంలోని నవాబుపేట గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఆదివారం మహంకాలమ్మ, పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో రోజంతా ఎంతో ఉత్సాహంగా హాజరయ్యారు.ఉదయం నుంచే గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.ఏటా నిర్వహించే ఈ బోనాల పండుగను ఈసారి పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధతో అన్ని ఏర్పాట్లు చేసి ఘనంగా నిర్వహించింది.భక్తులు మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి,నెత్తిన బోనాలతో అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివచ్చారు.డప్పుచప్పుల్లు శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతలతో గ్రామంలోని పురవీధులు మారుమోగాయి.గ్రామ సర్పంచ్ గూళ్ల రజిత రాజు,ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డిలు స్వయంగా ఉత్సవాల్లో పాల్గొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రజలంతా చల్లగా ఉండాలని అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు పాలకవర్గ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుళ్ల రాజు రజిత,ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,వార్డు సభ్యులు పిల్లి తిరుపతి,రాణా ప్రతాప్ సింగ్,బోయిని వేణుగోపాల్, గొట్టే రఘుబాబు,బోయిని వెంకవ్వ,పోలవేని రజిత,ఏడెల్లి సుజాత,గ్రామస్తులు కాంతాల రాజేందర్ రెడ్డి,సురేందర్ రెడ్డి,గూళ్ల కనకయ్య,కాంతాల సరోజన, అఖిలభారత రజక సంఘం రాష్ట్ర నాయకులు వరుకోలు రవీందర్,వరుకొలు సారయ్య,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రసన్నాంజనేయ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులుగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఏకగ్రీవ ఎంపిక



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి ఆగస్టు 2 (జనం సాక్షి)** ప్రసన్నాంజనేయ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని సంఘం కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.సంఘం అధ్యక్షులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రెడ్డి సంఘం అభ్యున్నతికి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సంఘం చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలకు అండగా నిలిచి, సంఘాభివృద్ధికి మార్గనిర్దేశం చేయాలని గౌరవాధ్యక్షులను కోరారు.సంఘం ఉపాధ్యక్షులు నర్సారెడ్డి మాట్లాడుతూ, సంఘ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమంలో ముందుండి పాల్గొంటానని, సంఘ అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, సంఘం అధ్యక్షులు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్రరెడ్డి, ఉపాధ్యక్షులు, కోశాధికారి, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, సంఘ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మానసిక,శారీరక దృఢత్వం గొప్ప వ్యక్తిత్వానికి పునాది

### - ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరావత్రి రాజశేఖర్



**ఆర్మూర్, ఆగస్టు 2(జనంసాక్షి):** విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢత్వంగా ఉంటేనే గొప్ప వ్యక్తిత్వానికి పునాది అవుతుందని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్,తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈరావత్రి రాజశేఖర్ తెలిపారు.ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మార్ గార్డెన్ లో గ్రాండ్ మాస్టర్,తైక్వాండో జిల్లా కార్యదర్శి కరాటే భోజన్న ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్ పోటీ విజేతలకు సర్టిఫికెట్ల ప్రధానం చేశారు.తైక్వాండో విద్యార్థులకు అప్డేట్ పద్ధతిలో బెల్ట్ మార్పిడి జరిగిన తీరును అభినందించారు.విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ ముందుకు సాగాలన్నారు.రాష్ట్రస్థాయిలో జరిగే తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు రామచందర్,అర్గుల్ సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఎడపల్లిలో ఘనంగా బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు జన్మదిన వేడుకలు

**ఎడపల్లి, ఆగష్టు 2 ( జనంసాక్షి ) :**
తడిపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో మండల పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మొదట మండలంలోని జానకంపేట్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు, అలాగే కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు పంటను పంపిణీ చేసి అనంతరం మంగల్ పాడు క్రాసింగ్ వద్ద కేకును కట్ చేశారు. ఆ తర్వాత మహా అన్నదానం నిర్వహించి బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ



అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, జానకంపేట సర్పంచ్ అనురాధ కిషన్ గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మాణిక్ రజిత యాదవ్, జైతాపూర్ సహకార సంఘం చైర్మన్ కరటూరి సత్యనారాయణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, జైతాపూర్ సర్పంచ్ నాగుల రాజు గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్తునూర్‌లో ఘనంగా బంగారు మైసమ్మ పండుగ

○గ్రామ దేవతలకు బోనాల సమర్పణ ○భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

**సదాశివనగర్, ఆగస్టు2 (జనంసాక్షి):**
సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో గ్రామ దేవతలు బంగారు మైసమ్మ పండుగ ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ పండుగలో గ్రామస్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవార్లని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బంగారు మైసమ్మ ఆలయంతో



పాటు గ్రామ దేవతలు నల్ల పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ, నాయకమ్మ, ముత్యాలమ్మ, ఆలయాలను రంగురంగుల పూలతోరణాలు, మామిడి ఆకులతో అందంగా అలంకరించారు. ఆలయాలు పండుగ శోభతో కళకళలాడగా, భక్తులు కొత్త వస్త్రాలు ధరించి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్ళు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. పండగ సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వ్యాధులు, విపత్తులు దూరమై గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని అమ్మవారిని వేడుకున్నారు. రైతులు తమ పంటలు బాగా పండాలని ప్రత్యేక అర్చనలు చేయించగా, యువత, చిన్నారులు కూడా ఉత్సాహంగా పండుగలో పాల్గొన్నారు. పండుగ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టగా, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా బంగారు మైసమ్మ పండుగ ఘనంగా సాగింది. గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రతి ఏడాది ఈ పండుగను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ అని, గ్రామ అభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలు, పాడిపంటల సమృద్ధి కోసం ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## సాలూర మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో
# సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**బోధన్, ఆగస్టు 2 ( జనంసాక్షి ) :**
సాలూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్న రవి ఆధ్వర్యంలో ఆదివారం బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని హున్సా గ్రామంలో బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నోటు బుక్స్ ను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఖాజాపూర్ గ్రామంలో ఎన్ ఎస్ యు ఐ అనిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్కులను పంపిణీ చేశారు. మండల కేంద్రంలో మండల సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో కేకు కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. అనంతరం సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాన్ని నిర్వహించారు. ఆ తర్వాత ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న బిఎల్ఎ2 లను ఘనంగా సన్మానించారు. మండలంలోని జాడి జమాల్పూర్ గ్రామంలోపార్టీ




సీనియర్ నాయకులు సుందర్ రాజు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకల భాగంగా కేకు కటింగ్ చేసి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్, ఉప సర్పంచ్ లు, వివిధ గ్రామల పార్టీ అధ్యక్షులు,పార్టీ బిఎల్ఎలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు అడిగితే "క్రిమినల్ వేస్ట్" అంటారా సీఎం రేవంత్ రెడ్డి గారూ?

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 2 (జనంసాక్షి) :**
రాష్ట్రంలోని 30 లక్షల మంది విద్యార్థులు తమకు రావాల్సిన రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తే వారిని "క్రిమినల్ వేస్ట్"గా అభివర్ణించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి, విద్యార్థుల పట్ల ఆయనకున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం రోజున కరీంనగర్లో ప్రవీణ్ రెడ్డి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ హక్కులను అడిగితే అవమానించడం కాదు, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విద్యార్థులనే నిందించే స్థాయికి దిగజారిందని విమర్శించారు. రెండున్నరేళ్లుగా విద్యాశాఖ మీ దగ్గరే ఉంది. ఈ కాలంలో విద్యా నాణ్యతను పెంచేందుకు తీసుకున్న ఒక్క సంస్కరణను అయినా చెప్పగలరా? ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యాయా? విశ్వవిద్యాలయాల్లో ఖాళీలు భర్తీ అయ్యాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించారా? స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందాయా? నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారా? అని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించలేక, ప్రశ్నించే విద్యార్థులనే "క్రిమినల్ వేస్ట్"గా ముద్ర వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమన్నారు. తెలంగాణ యువతను అవమానించే హక్కు ముఖ్యమంత్రికి లేదని స్పష్టం చేశారు. తక్షణమే "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రాష్ట్ర విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.





## మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో వైభవంగా బోనాల మహోత్సవం
## పాల్గొన్న కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న

**కరీంనగర్ అర్బన్, ఆగస్టు 2 (జనంసాక్షి) :**
కరీంనగర్ నగరంలోని కట్టరాంపూర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని, డప్పు చప్పుళ్ళు, మంగళ వాయిద్యాల నడుమ కట్టరాంపూర్ నుంచి కోతిరాంపూర్‌లోని పోచమ్మ దేవాలయం వరకు ఘనంగా ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న , 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మద హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తోటి కార్పోరేటర్లు సొగాని కొమురయ్య, నలువాల పుష్పలత -రవీందర్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, తోట మధు, మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## టిజీఓ జిల్లా కార్యదర్శి డాక్టర్ అరవింద్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కరీంనగర్ అర్బన్, ఆగస్టు 2 (జనంసాక్షి) :**
కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లోని టీజీవోల సంఘ భవనం ఎదుట టీజీవోల జిల్లా కార్యదర్శి అరవింద్ రెడ్డి జన్మదిన వేడుకలను టీజీవోల జిల్లా అధ్యక్షులు మడిపెల్లి కాళీ చరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ రెడ్డిని గజమాలలు, పూల బొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టిఎన్జీవోల



జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి తమ కార్యవర్గ సభ్యులతో కలిసి హాజరై, డాక్టర్ అరవింద్ రెడ్డిని శాలువా, పూల బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరవింద్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, ఉద్యోగ సంఘాల సేవలో మరింత ముందుకు సాగుతూ ఉన్నత పదవులను అలంకరించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిజీవోల టిఎన్జీవోల నాయకులు రామ్మోహన్, లక్ష్మీనరసింహారావు, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, నాగరాజు గూడ ప్రభాకర్ రెడ్డి సర్దార్ హరేమేందర్ మామిడి రమేష్ అభినయ రెడ్డి పూర్ణచందర్ రెడ్డి జలాలుద్దీన్ అక్బర్ రోహిత్ రాజేష్ భరద్వాజ్, ఒంటెల రవీందర్ రెడ్డి, గంగారపు రమేష్, ఎల్.ఆర్.సి. రామచంద్రారెడ్డి, రాజు నాయక్, మహేందర్ రెడ్డి, నరసన్నతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## ఘనంగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు

**- ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు, మిఠాయిలతో సందడి చేసిన మిత్రులు**

**సుల్తానాబాద్,ఆగస్టు 02(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా యువకులు,విద్యార్థులు,పాత స్నేహితులు ఒకచోటికి చేరి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుంటూ,మిఠాయిలు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు.జీవితంలో స్నేహానికి మించిన బంధం మరొకటి లేదని,కష్టసుఖాల్లో తోడుండేవాడే నిజమైన స్నేహితుడని పలువురు ఈ సందర్భంగా కొనియాడారు.మారుతున్న కాలంలోనూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ స్నేహితులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.సామాజిక మాధ్యమాల ద్వారా కూడా దూరంగా ఉన్న తమ మిత్రులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.మండలంలోని పలు పాఠశాలలు,కళాశాలల పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా సమావేశమై స్నేహ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

## మృత్యువుతో పోరాడుతున్న శ్రీనివాస్‌కు అండగా 'నీడ'..

**గోదావరిఖని, జనంసాక్షి :**



చికిత్స కోసం రూ.5వేల ఆర్థిక సహాయం అందించిన 'నీడ-మన 100 రూపాయలు సమాజం కోసం' గ్రూప్
రామగుండానికి చెందిన మామిడి శ్రీనివాస్ (50) బీపీ కారణంగా మెదడులో రక్తం గడ్డకట్టి శస్త్రచికిత్స చేయించుకున్నారు.ప్రస్తుతం మరింత చికిత్స, రిహాబిలిటేషన్ అవసరం ఉండగా, కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది.విషయం తెలుసుకున్న నీడ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలోని 'మన 100 రూపాయలు సమాజం కోసం' గ్రూప్ నుంచి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని-రవి చేతులమీదుగా అందజేశారు.ఈ సందర్భంగా 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని-రవి మాట్లాడుతూ మానవత్వంతో స్పందించిన నీడ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.అలాగే శ్రీనివాస్ చికిత్స కోసం దాతలు ముందుకు వచ్చి తమవంతు సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమరకేతన్ అంత్యక్రియలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ..

**గోదావరిఖని, జనంసాక్షి :**
సీపీఎం పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి వై.యాకన్న కుమారుడు సమరకేతన్ అనారోగ్యంతో హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.ఆదివారం గోదావరిఖని జీఎం కాలనీలోని యాకయ్య ఇంటికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటి సభ్యులు ఎస్.వీరయ్య వచ్చారు.సమరకేతన్ పార్థివ దేహానికి పూలమాలలు వేశారు.సమరకేతన్ అంత్యక్రియలకు హాజరయ్యారు.అనంతరం వై.యాకయ్య, బంధువు సాయిలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల్లో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.రాములు, స్కైలాబ్ బాబు, తుమ్మల రాజారెడ్డి, ఎరవల్లి ముత్యంరావు, గిట్ల ముకుంద రెడ్డి, పెద్దపెల్లి జిల్లా నాయకులు ఎ.మహేశ్వరి,కుమారస్వామి, జ్యోతి, ఎన్.బిక్షపతి,రామాచారి,మెండె శ్రీనివాస్, శైలజ,నాగలక్ష్మి, సిపిఎం-సిఐటియు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## జీడీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు

# సన్నాహక సమావేశం

## - ఆగస్టు చివరలో ఏఐ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు..

**గోదావరిఖని, జనంసాక్షి :**
పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జీడీ నగర్ (బసంత్‌నగర్)లో ఆదివారం ఉదయం ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు కుర్మపల్లి మాజీ సర్పంచ్ మామిడిపల్లి బాపయ్య, సీనియర్ జర్నలిస్టు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్ సమావేశానికి హాజరయ్యారు.జీడీనగర్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కోసం సన్నాహక సమావేశం చేపట్టారు.అందరి సమిష్టి కృషితో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని జీడీనగర్ గ్రామ శాఖ అధ్యక్షులు తీర్మానించారు.ఈ సందర్భంగా జీడీనగరు గ్రామ దళితులను..ప్రధానంగా ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం కమిటీ నాయకులు సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు.ఆగస్టు చివరి వారంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలో నిర్వహిస్తున్న 50 సంవత్సరాల మహాసభలను విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.అనంతరం జీడీనగర్ గ్రామ సర్పంచ్ సూర రమ రవిని కలిసి అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు,మహాసభలకు సహకరించవలసిందిగా కోరారు.ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జీడీనగర్ శాఖ అధ్యక్షులు కన్నం రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కలువల లింగయ్య,ఉప్పులేటి వెంకట్, రెడ్డపాక మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సలహాదారుకి శుభాకాంక్షలు తెలిపిన అయ్యప్ప శ్రీనివాస్

**ఆర్మూర్, ఆగస్టు 2( జనంసాక్షి)**
సీనియర్ నాయకులు,ప్రభుత్వ సలహాదారు,బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి జన్మదిన సందర్భంగా అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.హైదరాబాద్ లో వారి స్వగృహంలో కలిసి శాలువాతో సత్కరించారు. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు.

## కృష్ణవేణిలో ఆషాఢ మాస గోరింటాకు సంబరాలు..

**గోదావరిఖని, జనంసాక్షి :**



రామగుండం కార్పొరేషన్ పరిధి అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గోరింటాకు సంబరాలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల కరస్పాండెంట్ మంజుల శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలలో గోరింటాకు ఉన్న విశిష్టతను వివరించారు.మన పండుగలు, ఆచారాలను భావితరాలకు పరిచయం చేసి,వాటిని ఆచరించడం ద్వారా భారతీయ సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు, విద్యార్థులు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకొని, సాంప్రదాయ దుస్తుల్లో ఆనందోత్సాహాలతో కార్యక్రమంలో పాల్గొని ఆషాఢ మాస వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రభుత్వాలు కార్మికుల ప్రయోజనాలు పట్టించుకోవడం లేదు..

**- అవినీతి..అక్రమాలకు పాల్పడుతున్నాయి..**

**- సింగరేణిలో కాంట్రాక్టర్లకు అధిక రేట్లు ఇస్తూ కమీషన్లు ఆశిస్తున్నాయి..**

**- టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి..**

**గోదావరిఖని, జనంసాక్షి :**
తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ సమావేశం కాజిపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు.ఈ సమావేశానికి సంఘ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి హాజరయ్యారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సమావేశానికి సంబంధించిన తీర్మానాలు వివరించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు (కాంగ్రెస్) సింగరేణి కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాయని రాజిరెడ్డి పేర్కొన్నారు.సింగరేణి పరిరక్షణ, కాంట్రాక్టర్లకు అధిక రేట్లు ఇస్తూ..కమీషన్లు ఆశిస్తున్నారనే విమర్శలు చేస్తూ, సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు.సైట్ విజిట్ పేరు మీద, ఎక్స్‌ప్లోజివ్ టెండర్లు, ఓబీ కాంట్రాక్టులు, 800 మెగావాట్ల థర్మల్ పవర్, లోకల్ సోలార్ పవర్ వంటి అంశాలలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కిషన్‌రెడ్డికి,రేవంత్‌రెడ్డికి విన్నవించినా పట్టించుకోవడంలేదని అన్నారు. సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ సహాయ సహకారాలతో రాబోయే రోజుల్లో ప్రత్యక్ష పోరాటానికి సిద్ధంగా ఉన్నట్టు రాజిరెడ్డి తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు 2-3 మెడికల్ బోర్డులు పెడతామని చెప్పి మోసం చేసిందని, గతంలోలాగా అనారోగ్యంతో ఉన్న ప్రతి కార్మికుడికి,కాళ్లు లేని వారికి 'ఫిట్ ఫర్ సేమ్ జాబ్' అని కాకుండా సరైన న్యాయం జరిగేలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.మారుపేర్ల విషయాలు, విజిలెన్స్ కేసులు, క్రమశిక్షణ పేరుతో ఆబ్సెంటిజం అని చెప్పి ఇంక్రిమెంట్లు కోత విధించడం, డిస్మిస్ చేయడం వంటి చర్యలను రద్దు చేసేవరకు పోరాడతామని స్పష్టం చేశారు.కార్మికులకు కావాల్సిన సేఫ్టీ పరికరాలు, డ్రిల్ బిట్స్, డ్రిల్ రాడ్స్, మందులు, ఆయిల్స్/లూబ్రికెంట్స్ కొరతను తీర్చాలని, హెమ్ (హెచ్ఈఎంఎం) పర్చేజ్ విషయంలో ప్రైవేటీకరణ దిశగా వెళ్తున్న చర్యలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ మాత్రమే ఒకే స్టాండ్‌పై నిలబడ్డారని, గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గు గనులన్నీ సింగరేణికే చెందాలని స్పష్టం చేశారు.తాడిచర్ల, కోయగూడెం 3, సత్తుపల్లి 3 బ్లాకుల కోర్టు కేసులను క్లోజ్ చేయించి కేటాయించాలన్నారు.మణుగూరు దీప్ సైడ్ బ్లాక్, శ్రావణపల్లి కేకే-6 గనులను నామినేషన్ పద్ధతిలో సింగరేణికే ఇవ్వాలన్నారు.గోలేటి ఓసీ, మందమర్రి ఓసీ, కేకే ఓసీ,పూసపల్లి ఓసీ, మణుగూరు ఎక్స్‌టెన్షన్ ఓసీ వంటి వాటికి పర్యావరణ,అటవీ అనుమతులు ఇప్పించి దాదాపు 10,000 మందికి కొత్త రిక్రూట్‌మెంట్ అవకాశాలు కల్పించాలని రాజిరెడ్డి సూచించారు.సెప్టెంబర్ 9వ తేదీ నుండి అన్ని గనుల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహించి కార్మికులను చైతన్యవంతం చేస్తామని, అవసరమైతే ఢిల్లీకి కూడా వెళ్లి బీఆర్ఎస్ పార్టీ పెద్దల సహకారంతో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, మంగీలాల్, ప్రభాకర్ రెడ్డి, బడికల సంపత్,చెల్పూరి సతీష్,వడ్డేపల్లి శంకర్, ఐలి శ్రీనివాస్,జావిద్‌పాషా,పొలాడి శ్రీనివాసరావు,ఇందూరు సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్,అన్ని ఏరియాలకు సంబంధించిన కేంద్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.